సాక్షి
జనగామ
మంగళవారం | 23 | మే | 2023



అన్ని రంగాల్లో అభివృద్ధి
పాలకుర్తి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ఆదర్శంగా తీర్చిదిద్దుతున్నట్లు మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు తెలిపారు.
- 8లో▸



వీసీ పాలన గాడిన పడినట్లేనా?
కేయూలో వీసీ రమేశ్ ఆధ్వర్యంలో పలు సమస్యలు పరిష్కారం కాగా మరికొన్ని అలాగే ఉండిపోయాయి. వీసీగా బాధ్యతలు చేపట్టి నేటితో రెండేళ్లు పూర్తి చేసుకున్నారు.
- 8లో▸

గరిష్టం/కనిష్టం
40.0⁰ /27.0⁰

వాతావరణం
ఉదయం నుంచి ఎండ వాతావరణం ఉంటుంది. మధ్యాహ్నం ఉష్ణోగ్రతలు అధికంగా ఉంటాయి. వడగాలులు వీస్తాయి. రాత్రి సమయంలో ఉక్కపోత పెరుగుతుంది.

మిల్లర్లపై టాస్క్ 'ఫోర్స్'

ధాన్యంలో తేమ, తాలు పేరిట అదనపు కోతలపై సీపీ, టాస్క్‌ఫోర్స్ దాడులు

- జిల్లాలో ఇప్పటి వరకు రెండు కేసులు నమోదు
- రెండు రోజుల్లో మరోసారి టాస్క్‌ఫోర్స్ తనిఖీలు
- ధాన్యం దిగుమతిలో మిల్లర్ల సందిగ్ధత

జనగామ: యాసంగి ధాన్యం సేకరణలో పోలీసుల నజర్ మిల్లర్లను టెన్షన్‌కు గురిచేస్తున్నది. వరంగల్ పోలీస్ కమిషనర్ ఏవీ.రంగనాథ్ ఆకస్మిక తనిఖీలతో హడలెత్తిస్తున్నారు. తేమ, తాలు పేరిట మిల్లుల్లో ధాన్యం అదనపు కోతలపై సీరియస్‌గా ఉన్నారు. వెల్లువెత్తుతున్న రైతుల నిరసనలతో స్వయంగా రంగంలోకి దిగారు. ఓ వైపు సీపీ.. మరో వైపు టాస్క్‌ఫోర్స్ బృందాల తనిఖీలు మిల్లర్లను ఉక్కిరి బిక్కిరి చేస్తున్నాయి. బాధిత రైతులు నేరుగా పోలీస్ కమిషనర్‌కే ఫిర్యాదు చేస్తుండడంతో సంబంధిత శాఖల అధికారులు సైతం ఏమీ చేయలేక పోతున్నారు. దీనికి తోడు రాష్ట్ర పౌరసరఫరాల శాఖ కమిషనర్ అనిల్‌కుమార్ సైతం జిల్లాలోని రైస్ మిల్లులను తనిఖీ చేయడం సమస్య తీవ్రతకు అద్దం పడుతోంది.

ప్రకృతి పగ.. మిల్లర్ల దగా..

జిల్లాలో 27 లక్షల ఎకరాల్లో వరి సాగు చేయగా.. వర్షాభావ పరిస్థితులు, అకాల వర్షాలు, వడగళ్లతో 50శాతం వరి పంటకు నష్టం వాటిల్లింది. మూడు లక్షల క్వింటాళ్లకు పైగా దిగుబడి వస్తుందని అంచనా వేసిన అధికారులు.. రెండు లక్షల క్వింటాళ్ల ధాన్యం ప్రభుత్వ సెంటర్ల ద్వారా కొనుగోలు చేసేందుకు సిద్ధమయ్యారు. అయితే ప్రకృతి కన్నెర్ర చేయగా వరి పంట దెబ్బతినడంతో ఇప్పటి వరకు అంచనాలో సగం కూడా కొనుగోలు చేయలేని పరిస్థితుల్లో.. రైతుల నుంచి పెద్ద ఎత్తున విమర్శలు ఎదుర్కొంటున్నారు. కేంద్రాల్లో నాణ్యత పరిశీలించిన నిర్వాహకులు 40 కిలోల బస్తాకు 1.2 కిలోలు అదనంగా తూకం వేస్తున్నారు.. ధాన్యం మిల్లర్ల వద్దకు వెళ్లిన తర్వాత తేమ, తాలు పేరిట మళ్లీ కోతలు పెడుతుండడంతో జిల్లాలో అనేక చోట్ల రైతులు ఆందోళనకు దిగుతున్నారు. నాణ్యమై ధాన్యాన్ని సైతం ఇదే తరహాలో లెక్కకడుతూ మిల్లర్లు వాపస్ పంపే ప్రయత్నం చేస్తుండగా.. ఒప్పుకోవాల్సి వస్తోందని బాధిత రైతులు వాపోతున్నారు. ఇదిలా ఉండగా.. ధాన్యంలో నాణ్యత లేకపోవడంతో క్వింటాకు 55 నుంచి 58 కిలోల లోపే బియ్యం దిగుబడి వస్తుందని మిల్లర్లు అంటున్నారు.

ధాన్యం దిగుమతిపై సందిగ్ధం..!

ఐకేపీ, పీఏసీఎస్ సెంటర్ల నుంచి వచ్చే ధాన్యం దిగుమతి విషయమై మిల్లర్లు సందిగ్ధంలో పడిపోయారు. ధాన్యంలో కోతలపై రైతుల ఫిర్యాదు మేరకు పోలీసులు స్వయంగా రంగంలోకి దిగడం.. కొంత మంది మిల్లర్లపై కేసులు నమోదు కావడంతో ధాన్యం దించుకోవాలా లేదా అనే గందరగోళ పరిస్థితిలో మిల్లర్లు ఊగిసలాడుతున్నారు.

మరోసారి సీపీ రాక..?

ధాన్యం తూకంలో అదనపు కోతలు.. ఫేక్ ట్రక్‌షీట్.. ట్రాక్టర్ కాంటాలో గోల్‌మాల్ తదితర వ్యవహారాలపై టాస్క్‌ఫోర్స్ టీం ఇచ్చిన నివేదికతో సీపీ రంగనాథ్ మరోసారి జిల్లాకు వచ్చే అవకాశం ఉన్నట్టు తెలుస్తున్నది. మిల్లర్లు చెప్పే వాదన అటుంచితే.. చాలా చోట్ల నాణ్యమైన ధాన్యానికి కూడా కోతలు పెడుతున్నారని రైతుల ఫిర్యాదులతో పోలీసు దాడులు, కేసులు నమోదు చేస్తున్నారు. అయినా మిల్లుల్లో మాత్రం కోతలు కొనసాగుతుండడంతో అన్నదాతలు ఆందోళనకు దిగుతున్నారు. దీంతో సీపీ మరోసారి జిల్లాలో మిల్లులను తనిఖీ చేస్తారని సమాచారం. జిల్లా రైస్ మిల్లర్లు సీపీతో భేటీ కానున్నట్లు తెలిసింది. ఇదిలా ఉండగా.. రైస్ మిల్లులకు సంబంధించిన కేసులపై రాష్ట్ర స్థాయిలో పైరవీలు చేస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం.



సోమేశ్వర రైస్ మిల్లు వద్ద టాస్క్‌ఫోర్స్‌టీం, రైతులు, పోలీసులు(ఫైల్)



టాస్క్‌ఫోర్స్ బృందం గుర్తించిన ఒరిజినల్, ఫేక్ ట్రక్‌షీట్లు ఇవే..

మిల్లులపై దాడులు.. తనిఖీలు

బచ్చన్నపేట మండలంలోని శ్రీమిత్ర రైస్ మిల్లును రాష్ట్ర పౌరసరఫరాల శాఖ కమిషనర్ అనిల్‌కుమార్ తనిఖీ చేశారు. కొనుగోలు కేంద్రాల నుంచి వచ్చే సరుకును మిల్లులో ఏరోజుకు ఆరోజే దిగుమతి చేసుకుని కోత పెట్టొద్దని ఆదేశాలు జారీ చేశారు.

రైతుల ఫిర్యాదు మేరకు పోలీసులు, టాస్క్‌ఫోర్స్ బృందం చిల్పూరు మండలం చిన్న పెండ్యాల మీనాక్షి రైస్‌మిల్లును తనిఖీ చేసింది. రెండు కిలోల తరుగు తీస్తున్నట్లు విచారణలో గుర్తించి యజమానులపై కేసు నమోదు చేశారు.

సెంటర్ల నుంచి వచ్చే ధాన్యంలో కోతలు పెడుతున్నారని వచ్చిన ఫిర్యాదు మేరకు జనగామ మండలం చంపక్‌హిల్స్‌లోని దేవీ ఆగ్రోస్ ఇండస్ట్రీస్ రైస్ మిల్లును సీపీ రంగనాథ్, డీసీపీ పి.సీతారాం, పోలీసు అధికారులు తనిఖీ చేశారు. రికార్డులను స్వాధీనం చేసుకున్నారు.

జనగామ పట్టణంలోని వీరభద్ర రైస్ మిల్లును కలెక్టర్ శివలింగయ్య తనిఖీ చేశారు. ధాన్యం దిగుమతిలో కోతలు ఉండరాదని యజమానులను ఆదేశించారు.

జనగామ మండలం చీటకోడూరు శివారు సోమేశ్వర ఇండస్ట్రీస్ రైస్ మిల్లును టాస్క్‌ఫోర్స్ అధికారులు తనిఖీ చేసి నిబంధనలకు విరుద్ధంగా ట్రక్‌షీట్, కోతలు ఉన్నాయని గుర్తించారు. యజమానిపై కేసు నమోదు చేయగా.. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఎఫ్ఐఆర్ నమోదైంది.

జనగామలోని దేవీ ఇండస్ట్రీస్‌కు వచ్చిన లారీలకు సంబంధించిన రికార్డులను పరిశీలించిన టాస్క్‌ఫోర్స్ టీం.. చిల్పూరులోని ఓ రైస్ మిల్లుపై కేసు నమోదు చేశారు.

రా రైస్‌కు కష్టమే..



సీఎంఆర్ ధాన్యం కేటాయింపుల్లో రారైస్ మిల్లర్ల పరిస్థితి దారుణంగా ఉంది. ఎండాకాలం(రబీ) సీజన్‌లో 18 నుంచి 20శాతం, వానాకాలం(ఖరీఫ్) 42 నుంచి 40 శాతం వచ్చే పరిస్థితి లేదు. 433 క్వింటాళ్ల ధాన్యంలో 290 క్వింటాళ్ల బియ్యం(ఒక ఏసీకే) రావాలి. కానీ 600 క్వింటాళ్ల ధాన్యం పడితేనే.. ఒక ఏసీకే వస్తున్నది. ఎక్కువగా నూకలే వస్తున్నాయి. వాటిని ప్రైవేటుగా అమ్మినా గిట్టుబాటయ్యే పరిస్థితి లేదు. 2021–22 వానాకాలం సీజన్‌లో 55 ఏసీకేలు ప్రభుత్వానికి ఇవ్వాల్సి ఉండగా.. 45 కూడా రాలేదు. అదనంగా 10 ఏసీకేలు కొనాల్సి వచ్చింది. ఎండాకాలంలో బాయిల్డ్, వానాకాలం సీజన్‌లో రారైస్ మిల్లులకు కేటాయించాలి.

- చల్లా శ్రీనివాస్‌రెడ్డి, రా రైస్ మిల్లర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు

జనగామ టికెట్ నాదే..

ఆత్మీయ సమ్మేళనంలో ఎమ్మెల్యే ముత్తిరెడ్డి

జనగామ: జనగామ అసెంబ్లీ టికెట్ నూరు శాతం నాదే.. సీఎం కేసీఆర్, ముత్తిరెడ్డి బతికి ఉన్నంత కాలం ఇక్కడ మరొకరికి చాన్స్ లేదు.. నియోజకవర్గ ప్రజలు, పార్టీ శ్రేణులకు ధైర్యంగా చెప్పమని కేసీఆర్ భరోసా ఇచ్చారని ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి అన్నారు. బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు తాళ్ల సురేష్‌రెడ్డి అధ్యక్షతన స్థానిక ఎస్‌ఎంఆర్ గార్డెన్‌లో సోమవారం జరిగిన పార్టీ ఆత్మీయ సమ్మేళనంలో ఎమ్మెల్సీ, నియోజకవర్గ ఇన్‌చార్జ్ కోటిరెడ్డితో కలిసి ఎమ్మెల్యే పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధిలో నా పాత్ర ఏమేరకు ఉందో సీఎంకు తెలుసని, టికెట్ విషయంలో పార్టీ శ్రేణులు గందరగోళానికి గురికావొద్దని అన్నారు. ఎమ్మెల్సీ కోటిరెడ్డి మాట్లాడుతూ.. నియోజకవర్గాల్లో గెలుపు గుర్రాలను పార్టీ ఎప్పటికీ వదులుకోదని, ప్రజాసమస్యలు గుర్తించి పరిష్కరించగలిగే నాయకుడు ముత్తిరెడ్డి అని పేర్కొన్నారు. నియోజకవర్గంలో ప్రభుత్వ పరంగా పథకాలు అందుకున్న ప్రతి ఇంటికి వెళ్లి కేసీఆర్ పాలన గురించి అవగాహన కల్పించాలని కార్యకర్తలకు సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పి.జమునలింగయ్య, వైస్ చైర్మన్ మేకల రాంప్రసాద్, పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త జి.సంపత్‌రెడ్డి, నాయకులు, కౌన్సిలర్లు పసుల ఏబేలు, జూకంటి లక్ష్మీశ్రీశైలం, ఎండీ.సమ్మద్, కర్రె శ్రీనివాస్, మారబోయిన పాండు, అనిత, బండ పద్మ, స్వరూప, ఉడుగుల కిష్టయ్య, మామిడాల రాజు, మల్లిగారి రాజు, కందుకూరి ప్రభాకర్, శంకర్, తిప్పారపు విజయ్, సతీష్, లెనిన్, ఆలేటి రాజు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

జనగామ రూరల్: కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాలు, అర్బన్ రెసిడెన్సియల్ స్కూల్ ఉపాధ్యాయ, ఉద్యోగుల న్యాయమైన సమస్యలు పరిష్కారించాలని టీఎస్ యూటీఎఫ్ అధ్యక్షుడు చంద్రశేఖర్‌రావు డిమాండ్ చేశారు. సోమవారం కేజీబీవీ జిల్లా కన్వీనర్ రజని ఆధ్వర్యాన ఉపాధ్యాయులు, ఇతర ఉద్యోగులు కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం ఏఓ మన్సూరికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్‌రావు మాట్లాడుతూ.. ప్రభుత్వం క్రమబద్ధీకరిస్తుందనే ఉద్దేశంతో ఏళ్ల తరబడి అరకొర వేతనాలతో ఉద్యోగ భద్రత లేకుండా పనిచేస్తున్నారని, ఆర్థిక ఇబ్బందులతో కుటుంబాలు గడవక అవస్థలు పడుతున్నారని పేర్కొన్నారు. సీఎం ఇచ్చిన హామీ నెరవేరుస్తారనే ఆశతో ఉంటే పట్టించుకోవడంలేదని విమర్శించారు. సమస్యల పరిష్కారానికి దశల వారీ పోరాటాలు చేపడుతామని, అందులో భాగంగా జిల్లా కేంద్రాల్లో ధర్నాల అనంతరం ఎమ్మెల్యేలు, మంత్రులు, ఎమ్మెల్సీలకు వినతిపత్రాలు ఇస్తామని, అయినా ఫలితం లేకుంటే జూన్ 8న హైదరాబాద్‌లో మహా ధర్నా నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఉపాధ్యాయులు చైతన్య, ఎలిజిబెత్, కృష్ణవేణి, రజిత, ప్రశాంతి, హేమలత తదితరులు పాల్గొన్నారు.



ఏఓకు వినతిపత్రం అందజేస్తున్న ఉపాధ్యాయులు

ప్రభుత్వ భూమిలో గుడిసెలు

30 మందిపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు

బచ్చన్నపేట: గోపాల్‌నగర్ జీపీ పరిధి చిన్నరామన్‌చర్ల రెవెన్యూ శివారులోని 174 సర్వే నంబర్ ప్రభుత్వ భూమిలో గోపాల్‌నగర్, ఇందిరానగర్, చిన్నరామన్‌చర్ల, పోచన్నపేట, లక్ష్మాపూర్, గంగాపూర్, బచ్చన్నపేట గ్రామాలకు చెందిన ప్రజలు సుమారు 600 మంది సీపీఎం ఆధ్వర్యంలో సోమవారం గుడిసెలు వేసుకున్నారు. అయితే ఆ భూమిని సాగు చేసుకుంటున్న వారు గుడిసెలు వేయకుండా అడ్డుకోవడంతో ఇరువర్గాల మధ్య తోపులాట జరిగింది. ఆరు గంటల పాటు ఉద్రిక్తత చోటు చేసుకుంది. అనంతరం నర్మెట సీఐ నాగబాబు, తహసీల్దార్ వినయలత జోక్యం చేసుకొని సాగులో ఉన్న ఐదుగురిని, సీపీఎం నుంచి ఐదుగురిని తీసుకొని విచారణ చేపట్టారు. ఈ భూమిని పలువురు కొన్నేళ్లుగా ఖాస్తు చేసుకుంటున్న విషయం వాస్తవమేనని, ఇది ప్రభుత్వ భూమి కనుక వివాదం కోర్టులో ఉన్నందున ఇక నుంచి ఎవ్వరూ సాగు చేయొద్దని చెప్పారు. కోర్టు తీర్పు వచ్చిన తరువాతే ఏ నిర్ణయమైనా తీసుకుంటామని వారు పేర్కొన్నారు. అలాగే ఇందులో గుడిసెలు కూడా వేయొద్దని వెంటనే తొలగించాలని, లేదంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సీపీఎం నాయకులను హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి, మండల కార్యదర్శి బెల్లంకొండ వెంకటేష్, మిన్నాలపురం ఎల్లయ్య, చుంచు విజేందర్, అన్నెబోయిన శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



గుడిసెలు వేస్తున్న పలు గ్రామాల ప్రజలు

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు

ఖాస్తులో ఉన్న పస్తం జగన్నాథం ఫిర్యాదు మేరకు గుడిసెలు వేసిన 30 మందిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు ఎస్సై నవీన్‌కుమార్ తెలిపారు. 174 సర్వే నంబర్ ప్రభుత్వ భూమిలోని ఎనిమిది ఎకరాల్లో కొన్ని కుటుంబాలు ఏళ్ల తరబడి కబ్జాలో ఉంటూ సేద్యం చేసుకుంటున్నారని, అందులో అక్రమంగా గుడిసెలు వేసినట్లు జగన్నాథం ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు.

ప్రసవానికి వస్తుండగా ప్రమాదం

- తెల్లవారితే కూతురు డెలివరీ..
- ఆలేరు వద్ద ఆటోను ఢీ కొట్టిన కారు
- మృత్యువాత పడిన తల్లి
- తండ్రి, కూతురుకు తీవ్ర గాయాలు



మృతురాలు కమలమ్మ(ఫైల్)

జనగామ రూరల్: కూతురు ప్రసవం కోసం ఆటోలో బయలుదేరిన ఓ కుటుంబాన్ని రోడ్డు ప్రమాదం వెంటాడింది. అరగంటలో ఆస్పత్రికి చేరుకునే లోపే కారు రూపంలో మృత్యువు కబళించింది. వివరాలు ఇలా ఉన్నాయి. జనగామ మండలంలోని పెద్దతండా(ఎం) పరిధి మాన్‌కుతండాకు చెందిన గుగులోతు కాబోల్ భార్య కమలమ్మ దంపతులు కొన్నేళ్ల క్రితం బతుకుదెరువు కోసం హైదరాబాద్‌కు వెళ్లారు. వారికి ఇద్దరు కుమార్తెలు, ఒక కొడుకు. అక్కడ ఆటో నడుపుకుంటూ కాబోల్ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. పెద్ద కూతురు రాజేశ్వరి గర్భవతి కావడంతో డెలివరీ నిమిత్తం సోమవారం జనగామ ఎంసీహెచ్ ఆస్పత్రికి బయలుదేరారు. తండ్రి కాబోల్ ఆటో నడుపుతుండగా.. తల్లి కమలమ్మ, కూతురు రాజేశ్వరి వెనుక సీట్లో కూర్చున్నారు. ఆలేరు హైవే వద్దకు రాగానే వెనుక నుంచి అతివేగంగా వచ్చిన కారు ఢీకొట్టడంతో ఆటో ఎగిరి కుడివైపు రోడ్డు అవతల గుంతలో పడిపోయింది. ఇంతలో ఎదురుగా వచ్చిన మరోకారు(స్కార్పియో) డివైడర్‌కు ఢీకొంది. ఏం జరిగిందో తెలిసే లోపే కమలమ్మ(44) మృతి చెందింది. రాజేశ్వరి పక్కనే కిందపడడంతో గాయాలయ్యాయి. గాయపడి లేవనేని స్థితిలో ఉన్న కాబోల్ భార్య, కూతురును చూసి తల్లడిల్లిపోయాడు. హైవేపై ప్రయాణిస్తున్న పలువురు వచ్చి క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు. కమలమ్మ మృతదేహాన్ని ఆలేరు ఏరియా ఆస్పత్రిలో ఉంచారు. రాజేశ్వరి, తండ్రి కాబోల్‌కు ప్రథమ చికిత్స అనంతరం జనగామలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ఇదిలా ఉండగా కార్లలో ప్రయాణిస్తున్న వారు సైతం గాయపడినట్లు సమాచారం.

'బడి' పనుల పరిశీలన

జనగామ రూరల్: 'మనఊరు–మనబడి' కింద చేపట్టిన పనులు నత్తన నడకన సాగుతుండడంతో.. పాఠశాలల పునఃప్రారంభం నాటికి 'పూర్తయ్యేనా' శీర్షికన 'సాక్షి'లో సోమవారం వచ్చిన కథనానికి అధికారులు స్పందించారు. పట్టణంలోని బాలిక పాఠశాల నూతన భవనం పనులను సూపర్‌వైజర్ పరిశీలించారు.

సాక్షి ఎఫెక్ట్



పట్టణంలోని బాలికల పాఠశాల భవనం పనులు చేపడుతున్న కూలీలు

నగదు బదిలీ అమలు చేయాలి

- జీఎంపీఎస్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ముట్టడి

జనగామ రూరల్: జిల్లాలో డీడీలు తీసి సిద్ధంగా ఉన్న గొల్లకురుమలకు నగదు బదిలీ వెంటనే అమలు చేయాలని జీఎంపీఎస్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు మోటే దేవేందర్, సాధం రమేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌ను ముట్టడించి ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జిల్లాలో 22వేల మంది సహకార సంఘం సభ్యులు ఉన్నారని, వారందరికీ నగదు బదిలీతో పాటు.. ప్రస్తుతం ఉన్న జీవాలకు ఇన్సూరెన్స్ చేయాలని, ఉపాధి హామీ పథకం కింద సామూహిక గొర్రెల షెడ్లు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ప్రమాదవశాత్తు కాపరులు మరణిస్తే రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని, ప్రభుత్వ పోరంబోకు భూములను సొసైటీ పేరున చేసి జీవాలకు గడ్డి విత్తనాలు అందించాలన్నారు. వీటన్నింటినీ అమలు చేయకపోతే ప్రగతి భవన్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు వెంటకయ్య, రాజబీరయ్య, బాలరాజు, రమేష్, కుమారస్వామి, రాజు, ప్రభాకర్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న జీఎంపీఎస్ నాయకులు, గొల్ల కురుమలు

28న మాజీ సైనికుల ఆత్మీయ సమ్మేళనం

జనగామ రూరల్: మాజీ సైనిక ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఈనెల 28న జిల్లా కేంద్రంలో రాష్ట్ర స్థాయి ఆత్మీయ సమ్మేళనం నిర్వహిస్తున్నారు. ఇందుకు సంబంధించిన కరపత్రాలను సోమవారం జిల్లా కేంద్రంలో మాజీ సైనికులు ఆవిష్కరించారు. ఎస్‌ఎంఆర్ గార్డెన్‌లో ఉదయం 10.30 గంటలకు జరిగే ఈ సమ్మేళనానికి మంత్రి దయాకర్‌రావు, శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాష్, జెడ్పీ చైర్మన్ సంపత్‌రెడ్డి, ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి, కలెక్టర్ శివలింగయ్య, రాష్ట్ర సైనిక బోర్డు డైరెక్టర్ కల్నల్ రమేష్‌కుమార్ హాజరవుతున్నారని రిటైర్డ్ కల్నల్ డాక్టర్ మాచర్ల భిక్షపతి తెలిపారు. కరపత్రాల ఆవిష్కరణలో యూసఫ్, కరుణాకర్ రెడ్డి, సోము, వెంకటేశ్వర్లు, ప్రవీణ్, శ్రీనివాస్, భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న మాజీ సైనికులు

యువత సన్మార్గంలో నడవాలి

- ఎమ్మెల్యేలు ముత్తిరెడ్డి, రాజయ్య
- సీఎం కప్ క్రీడాపోటీలు ప్రారంభం

జనగామ: యువత సన్మార్గంలో ముందుకు వెళ్తూ.. చదువు, క్రీడల్లో రాణించాలని జనగామ, స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యేలు ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి, తాటికొండ రాజయ్య, కలెక్టర్ శివలింగయ్య, డీసీపీ పి.సీతారాం, మున్సిపల్ చైర్‌పర్సన్ పి.జమునలింగయ్య అన్నారు. జనగామ పట్టణం ధర్మకంచ స్టేడియంలో సోమవారం కలెక్టర్ అధ్యక్షతన జరిగిన జిల్లా స్థాయి సీఎం కప్ క్రీడా పోటీలను ప్రారంభించిన అనంతరం అతిథులు ప్రసంగించారు. యువత శారీరక, మానసిక దృఢత్వంతో ఉండేందుకు క్రీడా పోటీలు దోహదపడతాయన్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన క్రీడా ప్రాంగణాలను సద్వినియోగం చేసుకుని క్రీడల్లో ప్రతిభ కనబర్చాలన్నారు. మూడు రోజులపాటు జరిగే సీఎం కప్ పోటీల్లో పాల్గొంటున్న క్రీడాకారులకు భోజన, వసతి, హాస్టల్, మెడికల్ క్యాంపు తదితర సౌకర్యాలు కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. అంతకుముందు క్రీడాకారులతో ప్రతిజ్ఞ చేయించి వాలీబాల్, కబడ్డీ, ఫుట్‌బాల్, బాక్సింగ్, రన్నింగ్ పోటీలను ప్రారంభించి వారితో ఆడారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ప్రఫుల్‌దేశాయ్, జిల్లా యువజన సర్వీసుల శాఖ అధికారి గోపాలరావు, ఆర్డీఓ మధుమోహన్, డీఆర్డీఓ రాంరెడ్డి, మున్సిపల్ కమిషనర్ రజిత తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే బాటిళ్లు సేకరిస్తుంటే ఏం చేస్తున్నారు

సీఎం కప్ ప్రారంభోత్సవం సందర్భంగా మినీ స్టేడియంలో చెల్లా చెదురుగా ఖాళీ వాటర్ బాటిళ్లు, మజ్జిగ ప్యాకెట్లు పడి ఉండడాన్ని చూసిన ఎమ్మెల్యే ముత్తిరెడ్డి స్వయంగా వాటిని సేకరించారు. ఈ విషయాన్ని గమనించిన కలెక్టర్ శివలింగయ్య.. మున్సిపల్ కమిషనర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. శానిటేషన్ కార్మికులు ఎక్కడున్నారు.. క్లీన్ అండ్ గ్రీన్ తప్ప మున్సిపల్ శాఖకు వేరే పనేముందని మండిపడ్డారు.

ఇరిగేషన్ అధికారులపై సీరియస్

చీటకోడూరు డ్యాంలో నీటి శాతం తగ్గుతుండడంతో పట్టణానికి మట్టితో కూడిన నీరు సరఫరా చేస్తున్నారు. అశ్వరావుపల్లి రిజర్వాయర్ నుంచి నీరు విడుదల చేయాలని గతంలోనే ఇరిగేషన్ అధికారులను కోరారు. అయినా పట్టించుకోక పోవడంతో మున్సిపల్ చైర్‌పర్సన్ జమునలింగయ్య ఎమ్మెల్యే ముత్తిరెడ్డి దృష్టికి తీసుకువెళ్లగా.. ఆయన కలెక్టర్‌ను అడిగారు. వెంటనే కలెక్టర్‌తో పాటు ఎమ్మెల్యే ఇరిగేషన్ ఎస్ఈకి ఫోన్ చేసి వాకబు చేశారు. పట్టణంలో తాగునీటి కొరత లేకుండా చూడాలని ఆదేశించారు.



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎమ్మెల్యే



కబడ్డీ ఆడుతున్న ఎమ్మెల్యేలు ముత్తిరెడ్డి, రాజయ్య



రన్నింగ్ పోటీ..



కబడ్డీ ఫైట్

న్యూస్‌రీల్

అగ్రికల్చర్ డైరెక్టర్‌ను కలిసిన మార్కెట్ చైర్మన్



జనగామ రూరల్: రాష్ట్ర అగ్రికల్చర్ డైరెక్టర్ లక్ష్మీబాయిని జనగామ మార్కెట్ చైర్మన్ బాల్దె సిద్ధిలింగం సోమవారం హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మార్కెట్‌కు సంబంధించి పెండింగ్, నూతన పనుల మంజూరుతో పాటు పూర్తి స్థాయి కార్యదర్శి నియామకంపై మాట్లాడినట్లు సిద్ధిలింగం తెలిపారు.

జీవవైవిధ్య పరిరక్షణ అందరి బాధ్యత



జనగామ: జీవవైవిధ్య పరిరక్షణకు మనందరం బాధ్యతగా కృషి చేయాలని మున్సిపల్ చైర్‌పర్సన్ పి.జమునలింగయ్య అన్నారు. అంతర్జాతీయ జీవవైవిధ్య దినోత్సవం సందర్భంగా సోమవారం పట్టణ జీవవైవిధ్య యాజమాన్య కమిటీ ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. పశుపక్షాదులను కాపడుకోవాలని, మొక్కలు నాటడంతో పాటు వాటిని పరిరక్షించాలని చెప్పారు. పెరుగుతున్న ఎండలతోపాటు ఉష్ణోగ్రతలు తగ్గాలంటే ప్రతిఒక్కరూ పచ్చదనం పెంపొందించడం అలవాటు చేసుకోవాలన్నారు. అనంతరం మున్సిపల్ ఆవరణలో మొక్కలు నాటారు. కమిషనర్ రజిత, పట్టణ జీవవైవిధ్య యాజమాన్య కమిటీ కార్యదర్శి స్వరూప, అనిత, పల్లవి, మల్లవరపు అరవింద్‌రెడ్డి, పానుగంటి ప్రవీణ్‌కుమార్ జి.కృష్ణ పాల్గొన్నారు.

సీవైకేఎస్ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడిగా హిమగిరి



హిమగిరి

దేవరుప్పుల: చింధు యక్షగాన కళాకారుల సంఘం (సీవైకేఎస్) రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడిగా మండలంలోని అప్పిరెడ్డిపల్లికు చెందిన గడ్డం హిమగిరి ఎన్నికయ్యాడు. ఈ మేరకు చింధు యక్షగాన హక్కుల పోరాట సమితి జాతీయ, రాష్ట్ర అధ్యక్షుడు గజవెల్లి గణపతి, గడ్డం వెంకటేశ్వర్లు సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా హిమగిరి మాట్లాడుతూ అంతరించి పోతున్న చిందు యక్షగాన కళ అభ్యున్నతికి పాటుపడుతామన్నారు. అలాగే గౌరవ అధ్యక్షుడిగా ప్రముఖ చిందు యక్షగాన కళాకారుడు, హంస అవార్డు గ్రహీత గడ్డం సమ్మయ్య ఎన్నికైనట్లు పేర్కొన్నారు.

ఆత్మీయ సభను విజయవంతం చేయాలి

జనగామ రూరల్: రెడ్డిల కార్పొరేషన్ సాధనకు జూలై ఒకటిన హనుమకొండ రెడ్డి కన్వెన్షన్ హాల్‌లో నిర్వహిస్తున్న రెడ్డి ఆత్మీయ సభను విజయవంతం చేయాలని రాష్ట్ర రెడ్డి జాక్ అధ్యక్షుడు గోపు జైపాల్‌రెడ్డి అన్నారు. ఇందుకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను సోమవారం జనగామ రెడ్డి జాక్ అధ్యక్షుడు వెంటకట్‌రెడ్డి ఆధ్వర్యంలో స్థానికంగా ఆవిష్కరించారు. నాయకులు చందుపట్ల నర్సింహారెడ్డి, ఆరుట్ల లోకమంత్‌రెడ్డి, బి.వెంకట్‌రెడ్డి, జి.ప్రభాకర్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

ట్రాక్టర్‌లో తరలిస్తుండగా రోడ్డుపై పడిపోయిన ధాన్యం బస్తాలు



లారీలు రాక
అన్నదాతల గోస

లింగాలఘణపురం: కొనుగోలు కేంద్రాల వద్దకు లారీలు రాకపోవడంతో కల్లాల్లో ధాన్యం నిల్వలు పేరుకుపోతున్నాయి. రైతులే స్వయంగా ధాన్యాన్ని మిల్లులకు తరలించాలని అధికారులు చెప్పడంతో సోమవారం మండల కేంద్రానికి చెందిన రైతు ప్యాట రాములు ట్రాక్టర్ ఏర్పాటు చేసుకుని ధాన్యాన్ని నెల్లుట్ల మణికంఠ రైస్ మిల్లుకు తరలిస్తుండగా లోడ్ సరిగా చేయక రోడ్డుపై బస్తాలు పడిపోయాయి. కొన్ని బస్తాలు చినిగిపోయి ధాన్యం నేలపాలైంది. సదరు రైతు కింద పడిన ధాన్యాన్ని బస్తాల్లో నింపి మళ్లీ ట్రాక్టర్‌లో వేసేందుకు నానా కష్టాలు పడాల్సి వచ్చింది. ఒక్కసారిగా ధాన్యం రవాణా లారీలు బంద్ కావడంతో రైతులు ఇబ్బందులు పడాల్సి వచ్చింది.

క్లుప్తంగా

చికిత్స పొందుతున్న మాజీ మావోయిస్టు మృతి


శివాజీ (ఫైల్)

ఎంజీఎం: మాజీ మావోయిస్టు సూతి శివాజీ (72) వరంగల్ ఎంజీఎం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడు. శుక్రవారం అస్వస్థతకు గురైన ఆయనను కుటుంబ సభ్యులు ఎంజీఎంలో అడ్మిట్ చేశారు. గుంటూరు జిల్లా పొన్నూరుకు చెందిన శివాజీ వరంగల్ ఆర్ఈసీలో ఇంజనీరింగ్ పూర్తి చేశాడు. ఆ తర్వాత పీపుల్స్‌వార్ దళంలో చేరాడు. ఆర్ఎస్‌యూ ఆవిర్భావంలో కీలక పాత్ర పోషించాడు. పీపుల్స్ వార్ నేత కొండపల్లికి సహచరుడు. గెరిల్లా దళాలను ఏర్పాటు చేయడంలో దిట్ట. గిరాయిపల్లి ఎన్‌కౌంటర్‌లో మృతిచెందిన వారితో పనిచేశాడు. 1990 నుంచి 97 వరకు జైలు జీవితాన్ని గడిపి బయటకు వచ్చాడు. ప్రస్తుతం ఆయన నగరంలోని 22వ డివిజన్ మర్రివెంకటయ్య కాలనీలో నివాసం ఉంటున్నాడు. శివాజీ మృతదేహాన్ని వైద్య విద్యార్థుల విద్యాబోధన కోసం కాకతీయ మెడికల్ కళాశాలకు అప్పగించనున్నట్లు ఆయన కూతురు అమని, కుటుంబ సభ్యులు తెలిపారు.

వాగులో గల్లంతై వృద్ధుడు..


ఉప్పలయ్య(ఫైల్)

నర్సంపేట రూరల్: వాగులో గల్లంతై మండలంలోని మాధన్నపేట గ్రామానికి చెందిన బొల్లేని ఉప్పలయ్య(70) సోమవారం మృతి చెందాడు. ఉప్పలయ్యకు గ్రామ శివారులో, వాగు సమీపంలో రెండెకరాల వ్యవసాయ భూమి ఉంది. ఆ భూమిలో వరి సాగు చేశాడు. ధాన్యం కోసి ఆరబోయగా.. ప్రతీ రోజు తన గేదెను తీసుకొని వ్యవసాయ భూమి వద్ద మేపుకుని సాయంత్రం ఇంటికి తీసుకొచ్చేవాడు. ఎప్పటిలాగే.. సోమవారం ఉదయం ఉప్పలయ్య తన గేదెను తీసుకుని ఉదయమే ఇంటి నుంచి వ్యవసాయ భూమి వద్దకు వెళ్లాడు. ఈక్రమంలో మధ్యాహ్నం వాగులోకి వెళ్లిన గేదెను తీసుకొచ్చేందుకు వెళ్లి గల్లంతయ్యాడు. సాయంత్రం 7 గంటల సమయంలో గేదె మాత్రమే ఇంటికి రావడంతో కుటుంబీకులు వాగువద్దకు వెళ్లి చూడగా.. ఉప్పలయ్య తువాలు, చెప్పులు కనిపించాయి. స్థానిక సర్పంచ్ మొల్గూరి చంద్రమౌళి, గ్రామస్తులు గజఈతగాళ్ల సాయంతో వాగులో గాలించగా.. ఉప్పలయ్య మృతదేహం లభ్యమైంది.

రెడ్డి చికెన్ సెంటర్
కిషన్‌పుర, హన్మకొండ
Cell: 9989299661

వీసీ పాలన గాడిన పడినట్లేనా?


మహిళా హాస్టల్ నూతన భవనం ఇదే..


కేయూలో నిర్మిస్తున్న కె హబ్ భవనం

- ఎస్ఎఫ్‌సీ విద్యార్థులకు హాస్టల్ వసతి తొలగింపు
- సదుపాయాలు.. అభివృద్ధి పనులు
- అడ్జెంట్ ప్రొఫెసర్ల నియామకాలు
- అధ్యాపకులకు పదోన్నతులు
- న్యాక్ 'ఏ' గ్రేడ్ నిలబెట్టుకునేందుకు ప్రయత్నాలు
- నేటితో కేయూ వీసీ పాలనకు రెండేళ్లు

కేయూ క్యాంపస్: కేయూలో వీసీ ప్రొఫెసర్ తాటికొండ రమేశ్ ఆధ్వర్యంలో పలు సమస్యలు పరిష్కారమయ్యాయి. మరికొన్ని అలాగే ఉండిపోయాయి. వీసీగా రమేశ్ పాలన పగ్గాలు చేపట్టి ఈనెల 23తో రెండేళ్లు పూర్తి చేసుకుంటున్నారు. రెండేళ్ల పాలన కొంత ఖేదం, మరికొంత మోదం అన్నట్లుగా కనిపిస్తోంది. యూనివర్సిటీలో అధ్యాపకుల కొరత వేధిస్తూనే ఉంది. వీసీగా బాధ్యతలను చేపట్టినప్పుడు విద్యార్థులకు నాణ్యమైన విద్య, పరిశోధనలే కీలకంగా అందించేలా కృషి చేస్తానని వీసీ చెప్పినప్పటికీ ఇంకా ఆదిశగా అడుగులు వేయడం లేదని చెప్పవచ్చు. కొన్నివిభాగాల్లో తరగతులు అంతంత మాత్రమే కొనసాగుతున్నాయనడంలో అతిశయోక్తి లేదు. ఒకసారి స్నాతకోత్సవం కూడా నిర్వహించారు.

న్యాక్ సన్నద్ధానికే సమయం

వీసీ కొన్ని నెలలుగా న్యాక్ సన్నద్ధం కోసం సమయం వెచ్చిస్తూ అధ్యాపకులనూ ఆదిశగానే నడిపిస్తూ వస్తున్నారు. వర్సిటీలో విద్యార్థులు వివిధ సమస్యలపై తరచూ ఆందోళనలు కొనసాగిస్తూనే ఉన్నారు. రెండేళ్లయినా పాలన ఇంకా గాడిన పడినట్లేనా? అంటే భిన్నాభిప్రాయలు వ్యక్తమవుతున్నాయి. పలు అంశాల్లో వీసీ రమేశ్ అనేక విమర్శలు కూడా ఎదుర్కొంటున్నారు. పలు అపరిష్కృత సమస్యలున్నాయి. అయినా.. ఎవ్వరినీ పట్టించుకోకుండా తాను అనుకున్నదే చేస్తూ తన మార్క్‌తోనే పాలన కొనసాగిస్తున్నారు.


వీసీ తాటికొండ రమేశ్

నాన్చుడు ధోరణి..

బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి వివిధ సమస్యల పరిష్కారంలో నాన్చుడు ధోరణి అవలంబిస్తున్నారనే విమర్శల్ని వీసీ ఎదుర్కొంటున్నారు. విద్యాబోధనపై పర్యవేక్షణ కొరవడిందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఎక్కువగా వీసీ లాడ్జ్ నుంచే పాలన కొనసాగిస్తున్నారు. పరిపాలన భవనంలో తన చాంబర్‌కు అప్పుడప్పుడు మాత్రమే వస్తుండడం కూడా విమర్శలకు తావిస్తోంది.

హాస్టల్ వసతి తొలగింపు..

వీసీ కేయూలో ఎస్ఎఫ్‌సీ సీట్లను పెంచారు. ఈవిద్యాసంవత్సరంలో ఆయా ఎస్ఎఫ్‌సీ కోర్సుల విద్యార్థులకు హాస్టల్ వసతి తొలగించి హాస్టల్ అడ్మిషన్లు కల్పించలేదు. దీంతో ఎస్ఎఫ్‌సీ విద్యార్థులు ఆందోళనలు చేశారు. ఆందోళనలు చేసే వివిధ విద్యార్థి సంఘాల బాధ్యులపై కేసులు పెట్టడం కూడా విమర్శలకు తావిస్తోంది. క్యాంపస్‌లోని పోతన బాయ్స్ హాస్టల్‌లోని విద్యార్థులను న్యూపీజీ బాయ్స్ హాస్టల్‌కు పంపించారు. పోతన హాస్టల్‌లో ఇకపై విద్యార్థినులకు వసతి కల్పించనున్నారు.

నియామకాల్లేవు..

కేయూలో దశాబ్దకాలంగా అధ్యాపకుల నియామకం లేదు. 136 పోస్టులు మంజూరైనా భర్తీకి చర్యలు చేపట్టట్లేదు. రెగ్యులర్ అధ్యాపకులు 100 మంది వరకే ఉన్నారు. అడ్జెంట్ ఆచార్యులను 12 మందిని నియమించారు. మరో నలుగురికి ఈసీ అప్రూవల్ తీసుకున్నారు. అయితే వీరి నియామకం నిబంధనల మేరకు కాకుండా.. ఇష్టం వచ్చినవారినే నియమించుకుంటున్నట్లు పెద్దెత్తున విమర్శలు వస్తున్నాయి. పీహెచ్‌డీ రెండో కేటగిరీ అడ్మిషన్లలో జాప్యం చేస్తున్నారు.

'నాన్ టీచింగ్' సమస్యల పరిష్కారమేది?

కేయూలో అసిస్టెంట్ ప్రొఫెసర్లకు అసోసియేట్ ప్రొఫెసర్లుగా, అసోసియేట్ ప్రొఫెసర్లకు ప్రొఫెసర్లుగా పదోన్నతులు కల్పించారు. అయితే అకుట్ అధ్యక్షుడు శ్రీనివాస్‌కు సీనియర్ ప్రొఫెసర్‌గాను, జనరల్ సెక్రటరీ మామిడాల ఇస్తారికి ప్రొఫెసర్‌గా పదోన్నతులు కల్పించలేదు. దీంతో వీసీపై వారు ఆరోపణలు చేశారు. పలువురు అధ్యాపకులపై వీసీ కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నట్లు ఆరోపించారు. నాన్ టీచింగ్ రెగ్యులర్, తాత్కాలిక ఉద్యోగుల సమస్యలూ అపరిష్కృతంగా ఉన్నాయి. 73 మంది రెగ్యులర్ ఉద్యోగులకు పీఆర్సీ ఇవ్వాల్సి ఉంది. తాత్కాలిక ఉద్యోగులకు 30 శాతం వేతనాలు పెంచాలి. ఏది అడిగినా న్యాక్ తర్వాతే అని చెప్పడం గమనార్హం.

మౌలిక సదుపాయాలు.. అభివృద్ధి

- రూ.7 కోట్లతో మహిళా వసతి గృహ నిర్మాణం పూర్తి
- కేయూ అడ్మిషన్ల డైరెక్టరేట్ కోసం నిర్మించిన భవనంలో ఏర్పాటు చేయనున్న పీవీ విజ్ఞాన పీఠం
- పరిపాలన భవనంలో సెకండ్ ఫ్లోర్ నిర్మాణం
- దూర విద్యా కేంద్రంలో ఆడియో–వీడియో డిజిటల్ తరగతుల పునరుద్ధరణ
- న్యూ పీజీ బాయ్స్ హాస్టల్‌లో డైనింగ్ హాల్
- పరీక్షా విభాగం ప్రాంగణంలో మహిళా వాష్‌రూమ్
- రూ.కోటితో పరిపాలనా భవనం నుంచి దూర విద్య కేంద్రం వరకు సీసీ రోడ్డు నిర్మాణం
- క్యాంపస్‌లోని ఓ చోట చెక్ డ్యామ్ అభివృద్ధి
- గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ సౌజన్యంతో రూ 9.20 లక్షల వ్యయంతో మహిళా హాస్టల్ ప్రాంగణంలో ఓపెన్ జిమ్ ఏర్పాటు
- కేయూలో స్పోర్ట్స్ బోర్డ్‌లో ఉన్న జిమ్ ఆధునికీకరణ
- రూ. 6 కోట్ల వ్యయంతో క్యాంపస్‌లో చివరిదశలో కె హబ్ భవన నిర్మాణం
- విద్యార్థులకు మెరుగైన అవకాశాలు కల్పించేలా 34 ప్రతిష్టాత్మక సంస్థలతో అవగాహన ఒప్పందాలు
- న్యాక్ 'ఏ' గ్రేడ్‌ను నిలబెట్టుకోవాలని వీసీ సుమారు రూ.10 కోట్లకు పైగా వివిధ అభివృద్ధి, మరమ్మతుల పనులు బ్యూటిఫికేషన్‌ను చేయిస్తున్నారు. ఈపనులు పూర్తి కావొస్తున్నాయి.

అన్ని రంగాల్లో అభివృద్ధి


సింగరాజుపల్లి బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళన సభలో మంత్రి ఎర్రబెల్లి

- రాష్ట్ర మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

దేవరుప్పుల : పాలకుర్తి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ఆదర్శంగా తీర్చిదిద్దుతున్నట్లు రాష్ట్ర మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. సోమవారం జనగామ జిల్లా దేవరుప్పుల మండల పరిధి పడమటితండా(పెద్దతండా), సింగరాజుపల్లి క్లస్టర్లలో తీగల దయాకర్ అధ్యక్షతన నిర్వహించిన బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళన సభల్లో ఆయన మాట్లాడారు. నాడు ప్రజారంజక పాలనకు ఎన్‌టీఆర్ బీజాలు వేయగా.. నేడు కేసీఆర్ ఆయనను ఆదర్శంగా తీసుకుని ప్రజల మన్ననలు పొందుతున్నాడని పేర్కొన్నారు. ఎడారిలా కనిపించే ఈ ప్రాంతానికి సాగు, తాగు నీరు అందించి సస్యశ్యామలం చేసినట్లు చెప్పారు. కుటుంబ ఆర్థికాభివృద్ధిలో కీలకమైన మహిళలకు ఉచిత కుట్టుశిక్షణ ఇచ్చి ఉపాధి, ఉద్యోగ కల్పనకు శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం పెంచిన ధరల కారణంగా ప్రజలపై పెనుభారం పడుతోందని, 70 ఏళ్ల పాలనలో ఉన్న పార్టీలు చేసిన అభివృద్ధి శూన్యమని, ఇందుకు మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య నిదర్శనంగా నిలిచారని ఎద్దేవా చేశారు. ప్రతిపక్షాల అర్థరహిత విమర్శలు తిప్పికొడుతూ దేశవ్యాప్తంగా విస్తరిస్తున్న బీఆర్ఎస్‌ను బలపర్చాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ బస్వ సావిత్రి మల్లేశం, జెడ్పీటీసీ పల్ల భార్గవిసుందర్‌రామిరెడ్డి, వైస్ ఎంపీపీ విజయ్, పీఏసీఎస్ చైర్మన్ రమేశ్‌రెడ్డి, జలంధర్‌రెడ్డి, సర్పంచ్‌లు కోక్యా, మల్లేశ్, శ్రీనివాస్‌రెడ్డి ఉన్నారు.

అట్టహాసంగా ముగిసిన 'యువ సంఘం'


యువ సంఘం ముగింపు కార్యక్రమంలో నిట్ రిజిస్ట్రార్ గోవర్ధన్‌రావు, విద్యార్థులు

కాజీపేట అర్బన్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఏక్‌భారత్ శ్రేష్ట భారత్ కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన యువ సంఘం కార్యక్రమం సోమవారం నిట్‌లో అట్టహాసంగా ముగిసింది. సంస్కృతీ సంప్రదాయాలను నేటి తరానికి తెలిపేందుకు ఉత్తరాఖాండ్‌కు నిట్ వరంగల్ విద్యార్థులు, నిట్ వరంగల్‌కు ఉత్తరాఖాండ్ ఐఐటీ రూర్కేలాకు చెందిన 45 మంది విచ్చేసి సంస్కృతీ సంప్రదాయాలపై వారం రోజులు అధ్యయనం చేశారు. నిట్‌లోని అంబేడ్కర్ లెర్నింగ్ సెంటర్ ఆడిటోరియంలో సోమవారం ఏర్పాటు చేసిన యువ సంఘం ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నిట్ రిజిస్ట్రార్ గోవర్ధన్‌రావు హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి మాట్లాడారు. దేశవ్యాప్త సంస్కృతీ సంప్రదాయాలను రాబోయే తరాలకు అందించేందుకు వేదికగా యువ సంఘం కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఇందులో భాగంగా ఉత్తరాఖాండ్‌కు చెందిన విద్యార్థులు నగరంతో పాటు తెలంగాణలోని పలు ప్రాంతాలను సందర్శించి, గ్రామీణ ప్రాంతాల్లోని జీవన శైలిని, వ్యవసాయాన్ని, యాస, భాషలపై అధ్యయనం చేయడం అభినందనీయన్నారు. కార్యక్రమంలో యువ సంఘం నోడల్ ఆఫీసర్లు సునీల్‌కృష్ణ, శ్రీనివాస్, విద్యార్థులున్నారు.


ఉత్తరాఖండ్ విద్యార్థులతో నృత్యం చేస్తున్న గవర్నర్ తమిళిసై సౌందరరాజన్

విద్యార్థులతో కలిసి గవర్నర్ నృత్యం

'యువ సంఘం'లో ఆదివారం ఉత్తరాఖాండ్‌కు చెందిన విద్యార్థుల బృందం రాజ్‌భవన్‌లో గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ ఆతిథ్యాన్ని స్వీకరించేందుకు మర్యాదపూర్వకంగా కలిశారు. ఉత్తరాఖండ్ సంస్కృతీ సంప్రదాయాలను విద్యార్థులు వివరించారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన కల్చరల్ ఫెస్ట్‌లో ఉత్తరాఖండ్ విద్యార్థులతో గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ ఆనందంగా నృత్యం చేశారు. కార్యక్రమంలో నిట్ ప్రొఫెసర్లు వైఎస్.రెడ్డి, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

REAL ESTATE

TDR FOR SALE

- TDR For Sale. క్యాష్‌కి బదులుగా FLATS కొనబడును. సంప్రదించండి: 9618442268, 9885301652. [W-785540]

FLAT FOR SALE

- KUDA కాలనీ, 100 ఫీట్ల రోడ్డుకి, SPR School కు దగ్గరలో Stilt Plus 5 ఫ్లోర్స్ అపార్ట్‌మెంటులో 2 & 3 BHK Luxury Flats అమ్మకానికి కలవు. సెల్: 7660008666, 8309035091. [WA-27063]

HOUSE FOR SALE

- GWMC అప్రూవ్డ్ లే అవుట్ చింతగట్టు, హన్మకొండలో విల్లా ప్లాట్లు 4 BHK డూప్లెక్స్ హౌజ్, 3 BHK ఇండిపెండెంట్ హౌజింగ్ ప్రాజెక్ట్‌లో బుకింగ్ ప్రారంభమైనవి. Shabuddin. 9618892127. [W-785541]
- ఉర్సుగుట్ట నుండి ఖాజీపేట్ వెళ్ళు 150 ఫీట్ల రోడ్డు ప్రక్కన, భట్టుపల్లి SR Prime School కు ఎదురుగా 2 & 3 BHK Independent Houses అమ్మకానికి కలవు. సెల్: 7660008666, 8309035091. [WA-27064]
- వరంగల్, రంగశాయిపేట, శేషాద్రిహిల్స్‌లో E/F తో గల డీలక్స్ Ready to Occupy 2 BHK House అమ్మకానికి కలదు. సెల్: 7660008666, 8309035091. [WA-27065]
- ములుగురోడ్డు కాకతీయ కెనాల్ కన్నేమూల గణపతి టెంపుల్‌కి దగ్గరలో G+1తో గల Independent Houses అమ్మకానికి కలవు. సెల్: 7660008666, 8309035091. [WA-27066]
- కేవలం 22 లక్షలకే 121 చ॥గ॥ల స్థలంలో 620 Sft. తో డబుల్ బెడ్‌రూమ్ హౌస్ అమ్మబడును. (With Furniture) Cont: 9573689941. [M-9472]

SERVICES

LOANS

- హౌసింగ్, బిజినెస్, పర్సనల్, మార్టిగేజ్ & ఉద్యోగస్తులందరికి పర్సనల్ రుణాలు ఏ బ్యాంకులలో అయినా ఇప్పించబడును & IT Returns, GST License చేయబడును. పద్మావతి ఫైనాన్స్-WGL 9618767116 [W-785562]
- బాలాజీ లోన్స్ వరంగల్, మార్టిగేజ్‌లోన్, పర్సనల్‌లోన్, బిజినెస్‌లోన్, I.T. రిటర్న్స్ (G.S.T.) చేయబడును. కాకతీయ టాకీస్, వరంగల్. 8522825358, 9700123149. [M-1190700]

WANTED

- ఆదిత్య ITI Station Ghanpur లో Trade Instructors గా పనిచేయుటకు Electrical and Mechanical B. Tech or Diploma చేసిన వారు కావలెను. సెల్ నెం: 9391180737, 8374650070. [W-785572]

4 లైన్ల క్లాసిఫైడ్ ప్రకటన 260/- రూ॥ అదనపు లైను 60/- రూ॥ మాత్రమే 5% GST అదనము

- HYD (ఉప్పల్) ప్రముఖ హోమ్ కేర్ సంస్థ లో పని చేయుటకు లేడీ టెలీ కాలర్స్ 5, లేడీస్ సూపర్ వైజర్స్ 3, లేడీ రిసెప్షనిస్ట్ 2 స్త్రీలు కావలెను. జీతం: 10000/- -18000/- మీల్స్ ఫ్రీ. ఫోన్: 6300639598 [H-778996]
- ఫ్రాంచైజ్ ఆఫర్ (పెట్టుబడి లేదు) మా సంస్థను మీజిల్లాలోఅభివృద్ధి చేయగలిగేవారు కావలెను. Mega Group Man Power & Security. Conact: 70326 10569, 70931 25169. [NA-5620]
- మీ ఇంటి వద్దనే వుండి మీ మొబైల్ ద్వారా రోజుకు 50 మెసేజ్‌లు పంపుతూ వారానికి 3500/- సంపాదించుకోండి. మీ అడ్రస్ వాట్సాప్ చేయండి. వివరాలకు కాల్ చేయండి. 95736 33520, 90596 33520. [M-1221302]
- ప్రముఖ కంపెనీ నందు మీ ఇంటి వద్దనే ఉండి పార్ట్ టైమ్/ఫుల్‌టైమ్ పోస్టల్ కవర్లపై అడ్రస్‌లు వ్రాయుటకు స్త్రీ/పురుషులు కావలయును. జీతం: 15000+ ఇన్సెంటివ్స్. ఫ్రీ బుక్‌లెట్ కొరకు 8341371684. [G-786333]
- హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఫ్రీ వసతి+ భోజనం. జీ: 16K-18K, ఏజెంట్ కమిషన్ 6K. ఫోన్:9640258899. [H-793430]

WANTED TEACHERS

- Wanted to teach Phy./ Chem., Computers. Pri-Primary and Upper Primary teachers English Fluence is must. Contact: RCCS (EM), Sangem, WGL. 9959876292. [W-785574]
- Wanted Qualified Teachers to teach Social, Physics, Chemistry and Biology for Higher VI to X and also PET. Elohim School, Kommala. Cell: 7702026999, 9390112329. [W-785569]

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి
హన్మకొండ 9010144453
వరంగల్ 9705748198
నర్సంపేట 9010144453
జనగామ 9951602871
మహబూబాబాద్ 9010144453
జయశంకర్ భూపాలపల్లి 9705748198

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

గంజాయి స్మగ్లర్‌పై పీడీ యాక్ట్


నిందితుడికి పీడీ యాక్ట్ ఉత్తర్వులు అందజేస్తున్న వర్ధన్నపేట సీఐ

వరంగల్ క్రైం: గంజాయి స్మగ్లర్‌పై వరంగల్ పోలీస్ కమిషనర్ ఏవీ.రంగనాథ్ పీడీ యాక్ట్ ఉత్తర్వులు జారీ చేశారు. ఆంధ్రప్రదేశ్ నుంచి వరంగల్ మీదుగా మహారాష్ట్రకు గంజాయి స్మగ్లింగ్ చేస్తున్న మహారాష్ట్ర మాలేగావ్ ప్రాంతానికి చెందిన షేక్ మహబూబ్ అలియాస్ యాకూబ్‌పై సీపీ జారీ చేసిన ఉత్తర్వులను సోమవారం వర్ధన్నపేట సర్కిల్ ఇన్‌స్పెక్టర్ జి.సదన్‌కుమార్ నిందితుడికి చర్లపల్లి జైలులో అందించారు. యాకూబ్ గతేడాది నవంబర్ 19న మరో ఐదుగురితో కలిసి ఆంధ్రప్రదేశ్ నుంచి మహారాష్ట్రకు గంజాయి రవాణా చేస్తున్న క్రమంలో జాఫర్‌గఢ్ పోలీసులు ఈముఠాను అరెస్ట్ చేశారు. వీరి నుంచి రూ.10 లక్షల విలువైన వంద కిలోల గంజాయి, రెండు కార్లు, ఐదు ఫోన్లు స్వాధీనం చేసుకొని జైలుకు తరలించారు.

ఐపీఎల్ బెట్టింగ్ రాయుళ్ల అరెస్ట్

- రూ.80 వేల నగదు స్వాధీనం
- నాలుగు ఫోన్లు సీజ్


బెట్టింగ్ రాయుళ్ల అరెస్ట్

రామన్నపేట: డాఫాబెట్ యాప్ ద్వారా ఐపీఎల్ క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్న నలుగురిని టాస్క్‌ఫోర్స్ పోలీసులు సోమవారం అరెస్ట్ చేశారు. ఏసీపీ జితేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. వరంగల్ ఫోర్ట్ రోడ్డుకు చెందిన చింతం సాయికుమార్, చింతం కపిల్, శంభునిపేటకు చెందిన పస్తం వినోద్‌కుమార్, రంగశాయిపేటకు చెందిన గట్టు దర్శనం డాఫాబెట్ యాప్ ద్వారా ఐపీఎల్ బెట్టింగ్ నిర్వహిస్తున్నారు. విశ్వసనీయ వర్గాల సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్ సిబ్బంది ఈనలుగురిని కాశిబుగ్గ చౌరస్తాలో అదుపులోకి తీసుకున్నారు. వీరి నుంచి రూ.80 వేల నగదు, నాలుగు స్మార్ట్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. కార్యక్రమంలో పోలీస్ ఇన్‌స్పెక్టర్‌లు జనార్దన్‌రెడ్డి, శ్రీనివాసరావు, టాస్క్‌ఫోర్స్ పోలీసులు శరత్, లవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

చోరీలకు పాల్పడుతున్న ఒకరి అరెస్ట్

బయ్యారం: తాళం వేసి ఉన్న ఇళ్లను టార్గెట్ చేసుకొని దొంగతనాలకు పాల్పడుతున్న అంతర్‌జిల్లా దొంగను సోమవారం బయ్యారం పోలీసులు అరెస్ట్ చేశారు. గార్ల–బయ్యారం సీఐ బాలాజీ తెలిపిన వివరాల ప్రకారం.. ఖమ్మం జిల్లా కారేపల్లి మండలం మాదారం గ్రామానికి చెందిన పూనెం రాజు జల్సాలకు అలవాటు పడి దొంగతనాలు చేస్తున్నాడు. బయ్యారం పోలీస్‌స్టేషన్ పరిధితో పాటు కామేపల్లి, ఇల్లందు, చుంచుపల్లి, ఏన్కూరు పోలీస్‌స్టేషన్ల పరిధిలో రాజు పలు చోరీలకు పాల్పడగా కేసులు నమోదయ్యాయి. 2022 డిసెంబర్‌లో బయ్యారం స్టేషన్ పరిధిలో జరిగిన దొంగతనాల్లో రాజును అరెస్ట్ చేసి జైలుకు పంపగా.. జైలు నుంచి విడుదలైన తర్వాత తిరిగి మళ్లీ దొంగతనాలకు పాల్పడ్డాడు. ఈసమాచారం మేరకు రాజును అరెస్ట్ చేసి అతడి నుంచి రూ.5.50 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నట్లు సీఐ బాలాజీ తెలిపారు.

ప్రేమ విఫలమై యువకుడి ఆత్మహత్య


శ్యామ్ (ఫైల్)

తొర్రూరు: ప్రేమ విఫలమై తొర్రూరులోని చర్చి బజారుకు చెందిన అల్లం శ్యామ్ (26) ఆదివారం రాత్రి ఆత్మహత్య చేసుకున్నాడు. శ్యామ్ కూలీ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈక్రమంలో పట్టణంలోని ఓ యువతిని ప్రేమించాడు. ఆమె తిరస్కరించడంతో మనస్తాపం చెంది ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి సోదరి పస్తం స్వరూప ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని పట్టణంలోని ప్రభుత్వాస్పత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు.

అనాథ పిల్లలకు అండగా నిలిచిన ఎమ్మెల్యే


పిల్లలతో ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి

చిట్యాల: అనాథలైన పిల్లలకు ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి, వరంగల్ జెడ్పీ చైర్‌పర్సన్ గండ్ర జ్యోతి అండగా నిలిచారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అనాథ పిల్లలను పిలిపించుకుని డబుల్ బెడ్‌రూమ్ ఇల్లు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. తక్షణ సాయంగా నిత్యావసర సరుకులు, బట్టలు అందించారు. చిట్యాల మండలం పాశిగడ్డ గ్రామానికి చెందిన భూక్య సురేశ్, వసంత అనారోగ్యంతో మూడేళ్ల క్రితం మరణించడంతో వారి పిల్లలు తిరుపతి, లక్ పతి, సంజన, రాజేశ్ అనాథలయ్యారు. ఇటీవలి వర్ష బీభత్సానికి చిన్నారులు నివాసముంటున్న ఇంటి పైకప్పు లేచిపోయింది. ఈదీనస్థితిని స్థానిక నేతలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా.. సోమవారం పిల్లలను క్యాంపు కార్యాలయానికి పిలిపించుకొని తక్షణ సాయం కింద నిత్యవసర సరుకులు, బట్టలు అందించారు. వారు నివాసం ఉండేందుకు భూపాలపల్లిలో రెండు పడకల ఇల్లు ఇస్తానని హామీ ఇచ్చారు. కలెక్టర్‌కు ఫోన్ ద్వారా పిల్లల పరిస్థితి వివరించి త్వరగా చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే.. కలెక్టర్ భవేశ్ మిశ్రాను పిల్లలు కలిశారు. అన్ని విధాలా అండగా ఉంటానని కలెక్టర్ పిల్లలతో అన్నారు. కార్యక్రమంలో చిట్యాల జెడ్పీటీసీ గొర్రె సాగర్, గ్రామ సర్పంచ్ లావుడ్యా రజిత హరిభూషణ్ తదితరులు పాల్గొన్నారు.

తండ్రితో కలిసి తమ్ముడిపై దాడి

- తీవ్ర గాయాలతో చికిత్స పొందుతూ మృతి
- ఆస్తి తగాదాలే కారణమంటున్న గ్రామస్తులు


కృష్ణ (ఫైల్)

లింగాలఘణపురం: మండలంలోని నెల్లుట్లలో తండ్రితో కలిసి తమ్ముడిపై దాడి చేయగా మామిడ్ల కృష్ణ (32) సోమవారం మృతి చెందాడు. మామిడ్ల రాములుకు ముగ్గురు కుమారులు. అంజనేయులు, కృష్ణ, మల్లేశం. ముగ్గురికీ వివాహాలై నెల్లుట్లలో ఉంటున్నారు. ఆంజనేయులు, మల్లేశం రైల్వేలో బిల్లకూలీలుగా పని చేస్తుండగా.. కృష్ణ గ్రామంలోనే ట్రాక్టర్ కొనుక్కొని జీవనోపాధి పొందుతున్నాడు. నెల్లుట్ల బైపాస్ సమీపంలోని బీజేపీ కార్యాలయం పక్కనే తండ్రి రాములు పేరుతో ఉన్న 500 గజాల ప్లాటును ఇటీవలే కృష్ణకు తెలియకుండా తండ్రి, అన్న అంజనేయులు, తమ్ముడు మల్లేశం అమ్ముకున్నారు. విషయం తెలుసుకున్న కృష్ణ ప్లాటు అమ్మిన డబ్బులు తనకు కూడా ఇవ్వాలని వారిని అడిగినట్లు తెలిసింది. దీంతో ఈనెల 19న వీరి మధ్య గొడవ జరిగి కృష్ణను రాములు, ఆంజనేయులు కలిసి తీవ్రంగా కొట్టినట్లు సమాచారం. తలకు తీవ్ర గాయాలైన కృష్ణను హైదరాబాద్‌లోని ఆదిత్య ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ అతడు సోమవారం మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. ఈవిషయంపై ఎస్సై ప్రవీణ్‌ను వివరణ కోరగా.. తనకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని, ఆదిత్య ఆస్పత్రి యాజమాన్యంతో ఫోన్‌లో మాట్లాడగా.. మెట్లపై నుంచి పడ్డాడని చెప్పి ఆస్పత్రిలో చేర్పించారని చెప్పారు. ఆస్పత్రికి వెళ్లి దర్యాప్తు చేయనున్నట్లు ఎస్సై తెలిపారు.

ఆత్మహత్యకు దారి తీసిన వివాహేతర సంబంధం


వెంకటేశ్ (ఫైల్)

గార్ల: వివాహేతర బంధం కొనసాగిస్తూ, వివాహితను పెళ్లి చేసుకుంటానంటే, తల్లిదండ్రులు నిరాకరించారు. దీంతో గార్లకు చెందిన బాణాల వెంకటేశ్(25) సోమవారం ఆత్మహత్య చేసుకున్నాడు. గార్లలోని వేంకటేశ్వర స్వామి దేవాలయం బజార్‌కు చెందిన వెంకటేశ్ తాపీ మేస్త్రీగా పని చేస్తున్నాడు. ఈక్రమంలో కొంత కాలంగా అదే బజారుకు చెందిన ఓ వివాహితతో వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నాడు. ఇటీవల ఆమె భర్త అనారోగ్యంతో మృతి చెందాడు. ఆమెకు ముగ్గురు పిల్లలున్నారు. ఈక్రమంలో వెంకటేశ్ ఆమెనే పెళ్లి చేసుకుంటానని తల్లిదండ్రులకు చెప్పాడు. కానీ తల్లిదండ్రులు ఒప్పుకోకపోవడంతో జీవితంపై విరక్తి చెందిన వెంకటేశ్ ఇంట్లో ఎవరూ లేని సమయంతో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. 'ఇంటికి పెద్ద కొడుకువు.. మమ్మల్ని సాకుతావని ఆశలు పెట్టుకుంటిమి కదరా కొడుకా.. గింతపని చేస్తవనుకోలేదు కొడుకా' అంటూ తల్లితండ్రులు రోదించిన తీరు అక్కడున్న వారందరినీ కంటతడి పెట్టించింది. మృతుడి తండ్రి శ్రీనివాసాచారి ఫిర్యాదు మేరకు ఎస్సై కేసు నమోదు చేసుకున్నట్లు గార్ల ఎస్సై బానోత్ వెంకన్న తెలిపారు.

విశ్వబ్రాహ్మణ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు

హన్మకొండ కల్చరల్: ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన విశ్వబ్రాహ్మణ విద్యార్థులకు వోపాస్ ప్రతిభా పురస్కారాలు, నగదు పురస్కారాలు అందజేయనున్నట్లు వరంగల్ జిల్లా విశ్వ బ్రాహ్మణ అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అభ్యుదయ సంఘం (వోపాస్) అధ్యక్షుడు సిద్దోజు విద్యాసాగర్ తెలిపారు. సోమవారం సుబేదారిలోని సంఘం కోశాధికారి వల బోజు కేశవరావు గృహంలో ఏర్పాటు చేసిన కార్యవర్గ సమావేశంలో విద్యాసాగర్ మాట్లాడుతూ.. ఇటీవల విడుదలైన పదోతరగతి పరీక్ష ఫలితాల్లో 10 జీపీఏ సాధించిన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు జూన్ 25వ తేదీలోగా తమ పేర్లు నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 91541 02640, 95026 78767 నంబర్లలో సంప్రదించవచ్చని సూచించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా వ్యవస్థాపకులు కట్టా సత్యనారాయణచారి, డాక్టర్ అనసూరి చంద్రమౌళి, సభ్యులు గురుబ్రహ్మం, వేల్పుల దేవాచారి, సదానందచారి, శ్రీపాద సుధాకర్‌రావు, రాజ్‌కుమార్, దేవిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న వోపాస్ అధ్యక్షులు విద్యాసాగర్

ఫిజియోథెరపీ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా కార్యవర్గం ఏకగ్రీవం

- అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా వంశీకృష్ణ, రాకేశ్


వంశీకృష్ణ


రాకేశ్

కమలాపూర్: ఉమ్మడి వరంగల్ జిల్లా ఫిజియోథెరపీ డాక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా డాక్టర్ సిరికొండ వంశీకృష్ణ, ప్రధాన కార్యదర్శిగా డాక్టర్ గుండు రాకేశ్ ఎన్నికయ్యారు. ఈమేరకు ఆదివారం రాత్రి జరిగిన ఎన్నికల్లో వంశీకృష్ణ ప్యానల్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణ, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ వొడితెల రాము తెలిపారు. ఉపాధ్యక్షుడిగా డాక్టర్ చిరంజీవి, కార్యదర్శులుగా రామకృష్ణ, శైలజ, ప్రధాన కార్యదర్శులుగా మోసిన్, సుకుమార్, రఘుపతి, ఆర్గనైజింగ్ సెక్రెటరీలుగా కమలాకర్, సామ్రాట్, హరీశ్, కోశాధికారిగా వొడితెల రాము, మహిళా కో–ఆర్డినేటర్లు కృపాశాలిని, ప్రసన్న, అడ్వైజరీ కమిటీ సభ్యులుగా సునీల్ కిరణ్, శివరామకృష్ణ, హేమంత్‌రాజ్, క్రాంతిని ఎన్నుకున్నట్లు వారు తెలిపారు.

పిడుగుపాటుతో మూగజీవాల మృత్యువాత


ఆవు వద్ద విలపిస్తున్న రైతు సిద్ధులు

నర్మెట: మండలంలోని ఇప్పలగడ్డలో సోమవారం తెల్లవారు జామున పిడుగుపడి రైతు గరిగె వీరస్వామికి చెందిన ఆవు, దూడ మృతి చెందాయి. రైతుకు రూ.లక్ష నష్టం వాటిల్లింది. బొమ్మకూరులోని రావుల మల్లయ్య కొనుగోలు చేసిన ఒంగోలు జాతి మేలు రకం కాడెడ్లు రెండు పిడుగుపాటుతో మృతి చెందాయి. రూ.2 లక్షలు నష్టం వాటిల్లింది.

ఉస్తేనుగూడెంలో మరో ఆవు..

జనగామ రూరల్: మండలంలోని ఎర్రగొల్లపహాడ్ గ్రామ పరిధి ఉస్తేనుగూడేనికి చెందిన ఉస్తేపు సిద్ధులుకు చెందిన ఆవుపై సోమవారం తెల్లవారు జామున పిడుగుపడింది. రైతు ఎప్పటిలాగే తన వ్యవసాయ బావి వద్ద ఆవును ఉంచి ఇంటికి వెళ్లగా.. ఉదయం పడిన పిడుగుపాటుతో తన రూ.65 వేల విలువైన ఆవు మృతి చెందింది. ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలని రైతు వేడుకుంటున్నాడు.